అప్రమత్తతే ప్రధాన ఆయుధం

- సీజనల్ జ్వరాలపై అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు
- పారిశుద్ధ్య చర్యలతో జ్వరాలు దూరం

యలమంచిలి: వర్షాకాలం వచ్చేసింది. ప్రతికూల వాతావరణం వల్ల ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా దోమకాటు వలనే అధిక జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పటిష్ట పారిశుద్ధ్య చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే జ్వరాలబారిన పడకుండా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. కొన్ని రకాల జ్వరాలు ప్రాణాంతకంగా మారుతుంది. జ్వరమే కదా అని తేలికగా తీసుకోకుండా సత్వర వైద్యం తీసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో గ్రామాలలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. రోజురోజుకీ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఎండ కాస్తూనే వర్షం కురవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు అధికంగా వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేస్తూనే పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను, రోడ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ముఖ్యమని చెప్తున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచిస్తున్నారు. వర్షాకాలం కావడంతో సూపర్ క్లోరినేషన్ చేసిన నీటినే కుళాయిల ద్వారా సరఫర చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాలలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. బురదగా ఉన్న చోట బ్లీచింగ్ చల్లేలా చర్యలు తీసుకుంటున్నారు.


యలమంచిలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

అందుబాటులో వైద్య సేవలు

జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన రోగులకు మందులు ఇవ్వడమే కాకుండా అత్యవసరమైతే సిలైన్స్ కూడా పెడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

- వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగేసిన కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటినే మాత్రమే తాగాలి.
- ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలి.
- దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచాలకు దోమ తెరలు, కిటికీలు, గుమ్మాలకు దోమల మెస్‌లు వేసుకోవాలి.
- ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి.

వేగంగా వైద్య సేవలు



జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే రోగులందరికీ సత్వర వైద్యం అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి సెలైన్స్ పెడుతున్నాం. రోగాలబారిన పడకుండా ఉండాలంటే ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు సూచిస్తున్నాం.

వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, వైద్యాధికారి, యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

క్లుప్తంగా

న్యాయవాదుల ఆందోళన

నరసాపురం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) నరసాపురం శాఖ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు హాల్ వద్ద న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెక్కంటి క్రాంతికుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని కోరారు. మృతి చెందిన న్యాయవాదులకు ఇచ్చే బెనిఫిట్స్ పెంచాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఆర్ఎస్ కుమార్, కానూరి బుజ్జి, పులపర్తి హర్ష, బొలిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు


విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: రోటరీ యువజన మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గురువారం సాయంత్రం లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగే ముగింపు సమావేశంలో బహుమతులు అందజేస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు, చందక రాము, కానూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ, సలాది రామచంద్రరావు, చెస్ మాస్టారు పెనుగొండ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ వారికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన జి.అప్పలరాజు, పార్వతి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కిపు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.7,73,723 నగదు వచ్చిందని ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి తెలిపారు. 184 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో కె.శ్రీనివాసరావు, చైర్మన్ మంతెన రామకుమార్‌రాజు, ట్రస్టు బోర్డు సభ్యులు డి.లక్ష్మీపతిరాజు, ఆర్‌వీఎల్ నారాయణరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9 వేలు పలికిన లడ్డూ

వీరవాసరం: వినాయకుని లడ్డూను రూ.9 వేలకు వేలంలో బుధవారం దక్కించుకున్నారు. మండలంలోని రాయకుదురులోని గుడాల వారి వీధిలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. తోట రేవాన్ష్, వెంకట తనిష్ రూ.9 వేలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

వేధింపులపై ఫిర్యాదు

ఆకివీడు: భీమవరానికి చెందిన ఉప్పాడ మానిక సెల్‌ఫోన్ ద్వారా అసభ్యకర పోస్టులు పెడుతూ తనను వేధిస్తోందని మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన యాళ్ల శోభారాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

కోడి పందాలపై దాడి

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో కోడి పందాలు ఆడుతుండగా బుధవారం దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగబాబు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,300 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొట్టి గాయపర్చాడని ఫిర్యాదు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద బి వెంకటలక్ష్మిని అదే ప్రాంతానికి చెందిన ఎ.నాగేశ్వరరావు కొట్టి గాయపర్చాడంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్ టౌన్ ఏఎస్సై దేవరాజు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాడేరు రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద నివాసిస్తున్న వెంకటలక్ష్మి ఈనెల 26న బట్టలు ఆర వేసుకుంటుండగా అక్కడికి వచ్చిన నాగేశ్వరరావు అసభ్యకరంగా మాట్లాడడమేగాక బకెట్‌తో కొట్టిగాయపర్చాడు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు దేవరాజు చెప్పారు.

సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి నిమ్మలకు లేదు

పాలకొల్లు అర్బన్: పేదల పక్షపాతిగా నిలిచిన సీఎం వైఎస్ జగనమోహన్‌రెడ్డిని ఆర్థిక ఉగ్రవాదిగా పేర్కొంటూ స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించడం సహించబోమని గ్రామ సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఖండవల్లి వాసు ఖండించారు. పాలకొల్లులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతున్న సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదనన్నారు. 51 శాతం ఓట్లతో ప్రజాస్వామ్య పద్ధతిలో గెలుపొంది ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న సీఎం జగన్‌ను విమర్శిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు టిడ్కో గృహాల పేరుతో పేదల నుంచి దండుకున్న సొమ్ములకు లెక్కలు చెప్పాలని నిలదీశారు. అలాగే రోడ్డు కిరువైపులా నాటిన చెట్లకు ట్రీగార్డుల ఏర్పాటు చేస్తూ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తుల నుంచి వసూళ్లు చేసిన సొమ్ములకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లు చేసిన సొమ్ములకు, అలాగే కమిషన్ ఇవ్వని కాంట్రాక్టర్లపై పెట్టిన పోలీసు కేసులకు సమాధానం చెప్పాలని వాసు కోరారు. విలేకరుల సమావేశంలో 18వ వార్డు ఇన్‌చార్జ్ రామాంజుల పెదమధు, ఉండ్రాజవరపు రవికుమార్, యాండ్ర ప్రసాద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఖండవల్లి వాసు

వేగంగా సీసీ రోడ్డు నిర్మాణం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఏరియా ఆసుపత్రి ముందు భాగంలో రోడ్డు పాడై ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏరియా ఆసుపత్రి ప్రవేశ మార్గంలో రోడ్డు బాగా పాడైపోయింది. అంతేకాకుండా కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోయి రోగులకు అసౌకర్యంగా ఉండేది. ఈ నెల 19న ఆసుపత్రి సందర్శనకు వచ్చిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దృష్టికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రభాకరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్ తీసుకువచ్చారు. ప్రతీ రోజు అసుపత్రికి అంబులెన్స్‌లో వచ్చే రోగులు, 108, 104 వాహనాలు, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్‌లో వచ్చే గర్భిణులు, బాలింతలతో ఏరియా ఆసుపత్రిలోకి వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్ని సమయాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. దీంతో గుడాల గోపి స్పందించారు. మునిసిపల్ సాధారణ నిధులు రూ.2.50 లక్షలతో తక్షణం రోడ్డు నిర్మించాలని మునిసిపల్ అధికారులను కోరారు. దీంతో అధికారులు స్పందించి అత్యవసర మరమ్మతుల కింద ఈ నెల 23న సీసీ రోడ్డు నిర్మించారు. చెప్పిన వెంటనే వారం రోజులు గడవ కుండానే రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపికి ఆసుపత్రి అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


పాలకొల్లు ఏరియా ఆసుపత్రి ఎదురుగా సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం

గ్రామాల్లో వైద్య పరీక్షలు

మొగల్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటిక వెళ్ళి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం మొగల్తూరు ఆరోగ్య సిబ్బంది దయాల్‌దాస్‌పేటలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్ పునః ప్రారంభం


జెడ్పీ హైస్కూల్‌లో వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: విద్యార్థులకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలనే సంకల్పంతో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.70 వేలు వ్యయం చేసి ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయించినట్లు ట్రస్ట్ మేనేజర్ వడ్డే నారాయణరావు అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం పి.రాము మాట్లాడుతూ విద్యార్థులకు మంచినీరు అందించాలని విషయం చెప్పగానే స్పందించి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించిన ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంతర రామారావుకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు వీఎస్ఎన్ మూర్తి, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 80 రోజులకు గానూ స్వామివారికి రూ.15,80,107 ఆదాయం సమకూరినట్లు ఈవో మోకా అరుణ్ కుమార్, దేవస్థాన చైర్మన్ డీవీ కృష్ణంరాజు తెలిపారు. హుండీ లెక్కింపులో రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో దండు కృష్ణంరాజు, భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవో అల్లూరి సత్యనారాయణ రాజు, జ్ఞానానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి

మొగల్తూరు: రైతులు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సొసైటీ చైర్మన్ మోటుపల్లి రాంభాస్కరరావు కోరారు. బుధవారం మొగల్తూరు సొసైటీలో ఏర్పాటు చేసిన సంఘ మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘంలో ఉన్న రైతులకు ఇప్పటి వరకు సుమారు రూ.22 కోట్ల రుణాలు అందించామన్నారు. 2022–23 ఏడాదికి సంబంధించి రూ.35.30లక్షల ఆదాయం లభించిగా రైతులకు 15 శాతం డివిడెండ్ అందిస్తున్నామన్నారు. సంఘ పరిధిలో సుమారు రూ.2.20 కోట్ల మొండి బకాయలున్నాయని, వాటిని వసూలు చేసే ప్రయత్రంలో ఉన్నామని, రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన రైతులకు డివిడెండ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో రేవు రాంబాబు, తన్నీడి గిరి, కొల్లాటి మూలాస్వామి, సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


మొగల్తూరు సొసైటీలో సభ్యులకు డివిడెండ్ అందిస్తున్న దృశ్యం

వడలిలో సామూహిక ఎలుకల నివారణ

పెనుగొండ: రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం హరి ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామూహిక ఎలుకల నివారణలో భాగంగా బుధవారం వడలిలో రైతులకు విషపు ఎరలను పంపిణీ చేశారు. ఎలుకల వ్యాప్తితో దిగుమడులపై ప్రభావం చూపుతుందన్నారు. వీటి నివారణ ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చునన్నారు. దీని కోసం రైతులు అందరూ సామూహికంగానే చేపట్టడం ద్వారా ఫలితం సాధించవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ పంపిణీ చేస్తున్న బ్రోమోడయోలీన్ మందు నూకలు, నూనే కలిపి విషపు ఎరలను ఎలుక బొరియల్లో పెట్టాలన్నారు. కేవలం వరి చేలల్లోనే కాకుండా, కళ్ళాల్లోనూ, కాలువ గట్ల పైనా , అన్ని ప్రదేశాల్లోనూ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి స్పందన, వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీలె చిటికెన దుర్గాభవానీ బాబీ, రెడ్డి గణేశ్వరరావు, ఎంపీడీవో ఎస్ శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.


వడలిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉండి: ఈనెల 26న ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి అండర్ 14, జిల్లా స్థాయి అండర్ 17 జట్లకు ఎన్నార్పీ అగ్రహారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయి జట్లకు ఎంపికైన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఎల్‌జే ప్రతిభ, పి.చంద్రశేఖర్ నాయుడు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అండర్ 14 జట్టుకు, కె.మహాలక్ష్మి, ఎ.కార్తీక్ అండర్ 17 జట్లకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పీఈటీ కె.శ్రీనివాసరావును ఆయన అభినందించారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలు

పెనుగొండ: బాల్య వివాహాల వల్ల అనర్థాలు పెరుగుతాయని ఐసీడీఎస్ సూపర్ వైజరు ఎం విజయకుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు.బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలను ప్రజలు వివరించాలని సూచించారు.

పోషకాహార మాసోత్సవాలు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండ మూడవ సచివాలయంలో బుధవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. పోషకాహారం తీసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజరు ఎం.విజయకుమారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఎం వాసుదేవి తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాఠశాలకు ఎలక్ట్రికల్ మోటర్ అందజేత

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించడానికి ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ముందుకురావాలని శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ గాదె వెంకన్న అన్నారు. మండలంలోని లంకలకోడేరు చినపేట ప్రాథమిక పాఠశాలలకు బుధవారం రూ.8 వేలు విలువైన ఎలక్ట్రికల్ మోటర్, ట్యూబు లైట్లు అందజేసి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి హెచ్ఎం చిన్నయ్య చేస్తున్న కృషిని అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పల రజని, హెచ్ఎంలు ఉన్నమట్ల చిన్నయ్య, రాయపూడి భవానీ ప్రసాద్, పీఎంసీ చైర్మన్ పడవల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వినాయక నిమజ్జనాల సందడి


మొగల్తూరు: దయాళ్‌దాస్ పేటలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


పెనుగొండ: సిద్ధాంతంలో ఆకట్టుకున్న దీపోత్సవం

మొగల్తూరు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని బుదవారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో రోజు మంగళవారం కావడంతో నిమజ్జనాలు నిర్వహించకుండా బుధవారం నిర్వహించడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లోను, ప్రధాన కూడళ్లల్లోనూ ఏర్పాటు చేసిన విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనాలు చేశారు. స్థానిక, నెంబర్ 1 స్కూలు ప్రాంతంలోను, దయాల్‌దాస్‌పేటలో ఏర్పాటు చేసిన వినాయకుని ఊరేగింపులో తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ నుంచి వచ్చిన తీన్ మార్ బృందం ఆకట్టుకుంది. యువకుల జైశ్రీరాం నినాదాలతో బాణసంచా కాల్పులతో వినాయకున్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని వినాయకుడి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. నరసాపురం మండలంలోని సారవ, రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం, కొప్పర్రు, ఎల్బీచర్ల తదితర గ్రామాల సెంటర్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: సిద్ధాంతం రావిచెట్టు సెంటర్‌లోని జై భజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవంను యువకులు అంగరంగవైభోగంగా నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం కేదారీఘాట్‌లో నిమజ్జనం నిర్వహించారు. అలాగే సిద్ధాంతం మేడిశెట్టి వారి వీధిలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం రాత్రి నిర్వహించిన దీపోత్సవంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి మందిరాలలో ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతిష్ఠించిన గణపతి ప్రతిమలను వాహనాలపై ఉంచి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం గణపతి విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు. పెనుమంట్ర మెయిన్‌రోడ్డుగల శ్రీలక్ష్మిగణపతి, శివాలయం వద్ద ప్రతిష్ఠించిన వరసిద్ధి వినాయకుని ప్రతిమలను ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఊసల రామాలయం వద్ద రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కామారెడ్డి గ్రౌండ్‌లో అఖండ అన్నసమారాధన జరిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా పాలకొల్లు పట్టణంలో గణపతి నిమజ్జనోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులు పాటు భక్తులచే పూజలందుకున్న గణనాథులను ఊరేగింపుగా తరలించి పట్టణంలో సాయిబాబా ఆలయం వద్ద నిమజ్జనం చేశారు. స్థానిక యడ్లబజారు సెంటర్, బ్రాడీపేట, పెనుమదం రోడ్డు, వెలమగుడెం ప్రాంతాల నుండి వచ్చిన గణనాధులను గాంధీబొమ్మల సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వద్దకు తరలించి నిమజ్జనం చేశారు.